క్లుప్తంగా

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



పెడన: పల్లోటి లే అవుట్ సమీపంలో నూతనంగా మసీద్ నిర్మాణానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. మసీదు నిర్మాణానికి దాత ఆరున్నర సెంట్ల స్థలం ఇవ్వడంతో మసీదు నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు.కార్యక్రమంలో మంత్రి తనయుడు జోగి రాజీవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు, మున్నా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ల ఆవిష్కరణ



అవనిగడ్డ: పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ కానున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పోస్టర్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా నిత్యం ప్రజలతో ఉంటున్నామని, ఈనెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'ను జయప్రదం చేయండి

కోనేరుసెంటర్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బందరు నియోజకవర్గంలో ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 రోజుల పాటు జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. నియోజవకర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బందరు నియోజకవర్గ కన్వీనర్లు శీలం మారుతీరావు, చిటికెన నాగేశ్వరరావు, వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, గూడవల్లి నాగరాజు, నగర కన్వీనర్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

గూడూరు: కలపటం, ముక్కొల్లు, గండ్రం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలు గురువారం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు తెలిపారు. మూడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

కృత్తివెన్ను: చెరుకుమిల్లి పంచాయతీ ఉప్పులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి జోగిరమేష్ గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని ఏఈఈ వెంకన్నబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు.

పెన్షనర్ల సాయం

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన సామాజిక పింఛనుదారుడు పృథ్వీ సోమశేఖర్ ఇటీవల మృతిచెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 46,550 మృతుడి భార్య లక్ష్మీకి బుధవారం అందజేశారు. కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

జవ్వారుపేటలో ఇఫ్తార్ విందు

మచిలీపట్నంటౌన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. జవ్వారుపేటలోని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు షేక్ మౌలాలి ఇంటి వద్ద ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించగా ముస్లిం మహిళలు, పురుషులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు యాలగాల నూకానమ్మ, జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

- మంత్రి జోగి రమేష్
- వాడవాడలా జగ్జీవన్‌రామ్ జయంతి
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళి

పెడన: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. అణగారిన ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిన జగ్జీవన్‌రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, కౌన్సిలర్లు, నాయకులు కోడూరు శ్రీను, ముత్యాల మురళి, వన్నంరెడ్డి మహంకాళరావు పాల్గొన్నారు.

- పెడన మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య, టీపీఓ ఏసుబాబు, ఏఈ రమ్య, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సుందరం తదితరులు పాల్గొన్నారు.



పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్ తదితరులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

కోనేరుసెంటర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదాతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గం కన్వీనర్లు శీలం మారుతీరావు (బాబ్జీ), వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, గూడవల్లి నాగరాజు, పట్టణ కన్వీనర్ జలీల్, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర డైరెక్టర్ జక్కుల ఆనంద్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.



బందరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకుల నివాళి

- మోపిదేవి: మోపిదేవి, పెదప్రోలులో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు, రవీంద్ర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదప్రోలులో సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, దేవరపల్లి సురేష్‌బాబు, కోసూరు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు: గూడూరు సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేములసురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, పోలవరం, రాయవరం, కంకటావ, కంచాకోడూరు తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి.

సాంఘిక సమానత్వం కోసం కృషి

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సమానత్వం కోసం జగ్జీవన్‌రామ్ కృషి చేశారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీలి మునలయ్య, న్యాయవాదులు మాదివాడ వెంకట నరసింహారావు, లంకే వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, తుంగల హరిబాబు, కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



32వ డివిజన్ లో చీరలు పంపిణీ చేస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో రవీంద్ర, నాగేశ్వరరావు

వాడవాడలా జయంతి వేడుకలు

మచిలీపట్నంటౌన్: ఉల్లింగిపాలెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాల వేసి నివాళులర్పించారు. మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చీలి రవీంద్ర, దళిత జేఏసీ నాయకులు కుంపటి జయకర్‌బాబు, చైతన్య, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల దినేష్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపట్నం గుప్తా సెంటరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లూరి బసవ మాదిగ, బీడెల్లి మరియకుమార్ మాదిగ, దళిత జేఏసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), షేక్ సలార్‌దాదా, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. సర్వజన ఆస్పత్రి డైరెక్టర్ చీలి రవీంద్ర ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆర్టీసీ డిపోలోని గ్యారేజీలో కార్మికులు, ఉద్యోగులు పూలమాలలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 32వ డివిజన్‌లోని ఎస్సీ కాలనీలో చీలి రవీంద్ర ఆధ్వర్యంలో కాలనీ వాసులకు వస్త్రాలను పేర్ని కిట్టు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, దళిత జేఏసీ నాయకులు జయకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్, 31వ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొక్కిలిగడ్డ ఏసోబు, మాచవరపు ఆనంద్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. 28వ డివిజన్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం, చిత్రపటానికి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్ సాహెబ్, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కరార్ మోసవి, నాయకులు నివాళులర్పించారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గ్రంథాలయ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అసమానతలు రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ కృషి..

మచిలీపట్నంటౌన్: సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు మాజీ ఉప ప్రధాని దివంగత జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, విగ్రహ కమిటీ, దళిత జేఏసీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం మల్కాపట్నం గుప్తా సెంటర్‌లో జరిగింది. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు చంద్రలీల, ఎ. శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ అపరాజితసింగ్, పేర్ని కిట్టు, సలార్‌దాదా

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

అవనిగడ్డ: మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం, ఎనిమిదో వార్డులో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి పాల్గొని ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, మట్టా దయానంద్, నాయకులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

మంత్రి జోగి రమేష్

పెడన: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. నందమూరు సెక్టారు పరిధిలోని నందమూరు, బలిపర్రు, మడక, జింజేరు, కాకర్లమూడి, అచ్చయ్యవారిపాలెం, పుల్లపాడు గ్రామాలకు చెందిన 285 గ్రూపుల్లోని 2,825 మంది అక్కచెల్లెమ్మలకు రూ.2.28 కోట్ల ఆసరా మూడో విడత చెక్కులను మంత్రి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తోందని చెప్పారు. లబ్ధిదారుల చెంతకు పథకాలు చేరుతున్నాయని వివరించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని విమర్శించారు. వైద్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు అందేలా చర్యలు చేపట్టారని, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా నెలకు రెండు సార్లు గ్రామంలో వైద్యులుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేపడుతున్న వైఎస్సార్ సీపీ అంటే ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందని, అవన్నీ కలిసి వైఎస్సార్‌సీపీని ఏ విధంగా అయినా గద్దెదించాలనే కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. వారి కుయుక్తు లు, కుతంత్రాలను నమ్మకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే నడుద్దామని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ వాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చారుమతి, వైస్ ఎంపీపీలు వాకాలమ్మ, యాదంరెడ్డి వరప్రసాద్, నాయకులు రామానాయుడు, నాగబాబు, భైరవ లింగం, నరసింహారావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు, వెలుగు ఏపీ కనకారావు, ఏపీఎం శ్రీదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నందమూరులో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం జిల్లా ఫస్ట్

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. నగరంలోని 50 డివిజన్లలో 18,627 మంది పింఛనుదారులు ఉండగా 18,134 మందికి పింఛన్లు అందజేసి 97.35 శాతం పూర్తి చేశారు. ఇంకా 493 మందికి పింఛన్లు అందజేస్తే 100 శాతం పంపిణీ పూర్తవుతుంది. నగరంలోని పలు డివిజన్లలో ఆయా క్లస్టర్ల వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందజేశారు.

గుంటూరు ఆస్పత్రికి వెళ్లి పంపిణీ

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంకు చెందిన గొరిపర్తి కృష్ణయ్య అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ కోటేశ్వరరావు గుంటూరు ఆస్పత్రికి వెళ్లి కృష్ణయ్యకు పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను సర్పంచ్ కోసూరు అనూష, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు అభినందించారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ

మచిలీపట్నంటౌన్: 50వ డివిజన్‌కు చెందిన గర్భిణి వీరుడు నిర్మల విజయవాడలోని సర్వజన ఆస్పత్రిలో మాతా శిశు విభాగంలో చేరి చికిత్స పొందుతోంది. ఆమెకు దివ్యాంగ పింఛనును వలంటీర్ మధిర ప్రత్యూష విజయవాడ ఆస్పత్రికి వెళ్లి అందజేసింది. వలంటీర్ ప్రత్యూషను కార్పొరేటర్ మరీదు రాటాలమ్మ అభినందించారు.

కిడ్నీ బాధితురాలికి పింఛను అందజేత

మచిలీపట్నంటౌన్: 47వ డివిజన్‌లో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న జన్ను జయలక్ష్మీ డయాలసిస్ చేయించుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు మంజూరు చేసిన రూ. 10 వేల పింఛను మొత్తాన్ని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గౌర శ్రీహరి బుధవారం ఆమెకు అందజేశారు. జయలక్ష్మీ ఇంటికి వెళ్లి ఈ మొత్తాన్ని వలంటీర్ వినీత, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, డివిజన్ కన్వీనర్ కుమ్మరి హర్ష, వైఎస్సార్ సీపీ నాయకుడు కేశన నానితో కలిసి అందజేశారు.



విజయవాడ ఆస్పత్రిలో నిర్మలకు పింఛను అందజేస్తున్న వలంటీర్ ప్రత్యూష



36వ డివిజన్‌లో దివ్యాంగుడు రవికి పింఛను అందజేస్తున్న వలంటీర్ నామాల బ్రహ్మాజీ

సంక్షేమ పథకాల సారథి జగనన్న

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు శివారు ఇస్మాయేల్‌బేగ్‌పేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కులాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. నాడు నేడు, రైతు భరోసా, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ లబ్ధి అందుతోందని, ఇలా మన రాష్ట్రంలో మినహా దేశంలో ఎక్కడా లేదన్నారు.

ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ వెన్నా షైనీ, ఎంపీడీఓ ఆకుల పాండురంగారావు, ఈఓపీఆర్డీ యలవర్తి సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా నాయకులు కొండవీటి వెంకట నారాయణరావు, ఉప సర్పంచ్ ఇంకొల్లు మురళీకృష్ణ, ఎంపీటీసీలు మీసాల రాణీ నాంచారమ్మ, బడే హేమగంగాధరరావు, తిమ్మన వెంకట నాంచారమ్మ, కోట పద్మావతి, మాలే ప్రసాద్, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.




స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రక్షిత మంచినీటి పథకాలకు రూ.96 లక్షలు మంజూరు

మచిలీపట్నం ఎంపీ బాలశౌరి

పెడన: పెడన నియోజకవర్గంలో రక్షిత మంచినీటి పథకాలకు రూ.96 లక్షలు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హడ్కో హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశామన్నారు. పెడన మండలం కమలాపురం గ్రామ పంచాయతీలో రూ.31 లక్షలతో 2.00 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ ఏర్పాటు, గూడూరు మండలంలోని పోలవరం, ఆకులమన్నాడు, కృత్తివెన్ను మండలం యండపల్లి, మాట్లం, లక్ష్మీపురం గ్రామాల్లో ఒక్కో గ్రామంలో రూ.13 లక్షల చొప్పున మొత్తం రూ.65 లక్షలతో 0.50 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్లు ఐదింటిని ఏర్పాటు చేయనున్నారని వివరించారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని కనెక్ట్ టు ఆంధ్ర వారిచే అతి త్వరలో ప్రారంభిస్తారన్నారు.

లంకమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



అవనిగడ్డ: దివిసీమ భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం నుంచే పలువురు రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి ప్రదక్షిణలు చేయించారు. పలువురు భక్తులు ఘటం బిందెలతో వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఆలయ ఈఓ పి. సీతారామయ్య పర్యవేక్షించారు. పలు చోట్ల దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

పెడన: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని కృష్ణా జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. 18వ వార్డు ఇందిరా కాలనీ సహాయ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు 999 పూర్తయి వెయ్యిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్జి కృష్ణయ్య, అడిషనల్ ఎస్పీ ఎన్‌వీ రామాంజనేయులు, సామాజిక సేవా కార్యకర్త ఖాజా మోహినుద్దీన్‌లతో కలిసి కంప్యూటర్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, మామిడి ప్రసాద్, సాయిరాం, రాధాకృష్ణమూర్తి, రౌతుల ప్రసాద్, సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కృష్ణయ్య, పక్కన ఏఎస్పీ రామాంజనేయులు

అయ్యప్ప స్వామికి పూజలు

పెడన: అయ్యప్పస్వామి జయంతి వేడుకలు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి (వాసవి) మాత క్షేత్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వాసవి మహిళా మండలి ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి, శ్రీరామచంద్రమూర్తి దంపతులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సంఘ నాయకులు చంటి, సత్యనారాయణ, నాగేశ్వరరావు, పద్మ, భాగ్యలక్ష్మీ, రేణుక తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు.

అయ్యప్ప ఉత్తర నక్షత్ర సేవ

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం స్వామి వారికి ఉత్తర నక్షత్ర సేవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని బంగారు అయ్యప్పకు అభిషేకాలు, పూజలు జరిగాయి. పలు రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. సాయంత్రం వేణుస్వామి బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి భజన నిర్వహించారు. సుహవాసినిలు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.

వైభవంగా వెంకన్న నగరోత్సవం

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి నగరోత్సవం వైభవంగా జరిగింది. భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు గరుడ వాహనంపై ఆశీనులు కాగా భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి లోక కల్యాణార్థం మహాశాంతి హోమం జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎంఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలో గురువారం నుంచి ఈనెల 30 తేదీ లోగా ఆస్తి పన్ను చెల్లింపుదారులకు పన్ను మొత్తం నుంచి 5 శాతం మినహాయింపు ఇస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ జి. చంద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.